ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

కామారెడ్డి/రాజంపేట, డిసెంబర్ 9 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. రెవెన్యూకు 28, డీఏవోకు ఏడు, సివిల్ సప్లై ఆఫీస్‌కు ఒకటి, డీఈవోకు మూడు, డీపీవోకు 10, ఫిషరీస్‌కు ఒకటి, ఫారెస్టు ఆఫీస్‌కు ఒకటి, డబుల్ బెడ్‌రూమ్‌కు ఆరు, మున్సిపల్‌కు నాలుగు, డీఆర్డీవోకు రెండు, ఎస్సీ డెవలప్‌మెంట్‌కు ఒకటి, ఎస్పీ ఆఫీస్‌కు ఒకటి, ఇతరులు ఒక్క ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. రాజంపేటలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కామారెడ్డి, డిసెంబర్ 9 : కార్మికులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వేతనాలను పెంచేందుకు ఇచ్చిన 75 జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ అధ్యక్షుడు ప్రకాశ్, పరమేశ్, కిశోర్, సురేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 9 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష విద్యా శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ అమలు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు 19,600 మంది ఈ నిరవధిక సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.

సమ్మెకు వెళ్తే విద్యాశాఖలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగులు బోధన, బోధనేతర పనులు నిలిపివేసి విద్యావ్యవస్థను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఇందుకు టీచర్స్ యూనియన్ సంఘాలన్నీ తమకు మద్దతు ఇచ్చాయని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్ రావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షుడు వాసంతి, కోశాధికారి భాను, నాయకులు శ్రీను, శ్రీధర్ కుమార్, రాములు, యోగేశ్వర్, సంతోష్‌రెడ్డి, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

'భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం'

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో చందర్

నస్రుల్లాబాద్, డిసెంబర్ 9 : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో చందర్, ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, ఐఈఆర్‌పీ రూప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మాచారెడ్డి, డిసెంబర్ 9 : మాచారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా? లేదా అనే విషయాలను తెలుసుకోవడంతోపాటు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారి, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

'సామాజిక న్యాయానికి కాంగ్రెస్ వ్యతిరేకం'

బాన్సువాడ, డిసెంబర్ 9 : సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ బద్ద వ్యతిరేకని, ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనం ఖాయమని ఎంఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాయి మాదిగ అన్నారు. మాదిగలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మాజీ సర్పంచుల అరెస్టు

భిక్కనూరులో మాట్లాడుతున్న మాజీ సర్పంచు తునికి వేణు

భిక్కనూరు/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 9 : మండలంలోని మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం తెల్లవారు జామున అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ తునికి వేణు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని చేపట్టిన పలు పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ ఏడాదిలో సర్పంచులను ఎనిమిది సార్లు అరెస్టు చేశారని తెలిపారు. పెండింగ్ బిల్లులు వచ్చే వరకు ఎన్ని అరెస్టులు చేసినా తమ పోరాటం ఆపబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మధుమోహన్‌రెడ్డి, పోతిరెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, రాజలింగం పాల్గొన్నారు.

ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచులను సోమవారం ఉదయం ఎల్లారెడ్డి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల బిల్లుల కోసం ముట్టడికి సిద్ధమవుతున్న లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బట్టి కాడి రవీందర్‌గౌడ్, కళ్యాణి మాజీ సర్పంచ్ రఘువీర్ గౌడ్, సోమార్‌పేట్ మాజీ సర్పంచ్ అంజాగౌడ్‌ను ఆదివారం అర్ధరాత్రి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రోడ్డుపై బైఠాయించిన కుటుంబీకులు, గ్రామస్తులు

రాజంపేట్ డిసెంబర్ 9 : మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొందుర్తి గ్రామానికి చెందిన మహ్మద్ ఆరీఫ్(33) మృతి చెందాడు. బైక్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్లగా కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సోమవారం జాతీయ రహదారిపై కుటుంబీకులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు పక్కన హోటల్ ఉండడంతో వాహనాలు నిలుపుతున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. హోటల్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంక్ ఎదుట వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం తెలుసుకున్న దేవునిపల్లి ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ధర్నాను విరమింపజేయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రమాదకర స్థలాల పరిశీలన

జాతీయ రహదారిపై ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భిక్కనూరు, డిసెంబర్ 9 : జాతీయ రహదారి పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్న దుకాణాలను వెంటనే తొలగించాలని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ అన్నారు. 44వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకొని నేషనల్ హైవే అథారిటీ, గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా ఉన్న పంచర్ దుకాణాలు, ఇతర వాహన దుకాణాలను నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీ నుంచి నోటీసులు ఇప్పించి మూసివేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, పంచాయతీ కార్యదర్శి మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

బిచ్కుంద, డిసెంబర్ 9 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాథమిక ఉన్నత పాఠశాలను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంఈవోవెంట పాఠశాల, కాంప్లెక్స్ హెచ్ఎం దత్తాగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎంఈవోలకు వినతి పత్రం అందజేత

నిజాంసాగర్, డిసెంబర్ 9 : రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు సమగ్రశిక్షా ఉద్యోగులు నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఎంఈవోలు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రాజు, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్, ఐఆర్పీలు గైని చిన్న సాయిలు, సునీల్, మెసెంజర్ పంచాక్షరి, సీఆర్పీలు శ్రీధర్ కుమార్, నరసింహులు, వెంకటరామాగౌడ్, శంకర్ గౌడ్ తదితరులున్నారు.

దత్తాత్రేయ మందిర నిర్మాణానికి భూమిపూజ

ప్రవచనాలు చేస్తున్న సిద్ధేశ్వరగిరి మహరాజ్

ఎల్లారెడ్డిరూరల్, డిసెంబర్ 9: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని దత్తగిరి పీఠంలో నిర్వాహకులు మాణిక్య మహరాజ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, బర్దిపూర్ పీఠాధిపతి సిద్ధేశ్వరగిరి మహరాజ్ చేతుల మీదుగా సోమవారం దత్తాత్రేయ మందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం పీఠాధిపతి భక్తులకు ప్రవచనాలు చేశారు. త్వరలోనే మందిర నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పట్టణానికి చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, ATUKARI LATHA, W/o. Atukari Narendar Rao, R/o. 3-96, Devanpally, Kamareddy-503 111, T.S. Changed My Name as ATUKARI RADHA BAI, W/o. Atukari Narendar Rao.
NT-827109

WANTED

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిబిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'అదనపు పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలి'

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర పంచాయతీ కార్యదర్శులు

కామారెడ్డి, డిసెంబర్ 9 : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులను ఇతర ప్రభుత్వం శాఖలకు సంబంధించిన పనులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అదనపు పనులు, సెలువు దినాల్లో పనులతో ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నామని, కుటుంబానికి తగిన సమయం కేటాయించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని సమస్త పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'గృహ సర్వే చేయలేం'

నాగిరెడ్డిట, డిసెంబర్ 9: ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల సర్వే తాము చేయలేమని..ఎంపీడీవో ప్రభాకర్‌కు మండలంలోని గ్రామ కార్యదర్శులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సర్వేలో రెండు ఆప్షన్లు అర్హత, అనర్హత మాత్రమే ఇచ్చారని... తాము గ్రామాల్లో ఉంటామని, నిత్యం గ్రామ ప్రజలతో ఉండే తమకు ఇబ్బందులు ఏర్పడతాయని వాపోయారు. ఇతర శాఖలకు సర్వే ఇవ్వాలని, వారికి సపోర్టుగా ఉండి సర్వేలో పాల్గొంటామని ఎంపీడీవోను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

ఎల్లారెడ్డిలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసిన అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 9: ఎల్లారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటేశం మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్ అడ్విలింగాల్ విద్యార్థి అజయ్‌కుమార్ ప్రథమ బహుమతి, జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు కళ్యాణి, తేజశ్రీ ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఇంగ్లిష్ మీడియంలో ఎల్లారెడ్డి కేజీబీవీ విద్యార్థి కావేరి ప్రథమ బహుమతి, అన్నాసాగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ప్రణీత ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారని తెలిపారు. రెసిడెన్షియల్ విభాగంలో మోడల్‌స్కూల్ విద్యార్థులు మానస, అక్షర ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 19వ తేదీన జరిగే జిల్లా స్థాయి పరీక్షల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్విలింగాల్ పీజీహెచ్ఎం శివనర్సింహారావు, ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి, మామిడి రమేశ్‌కుమార్, కృష్ణంరాజు, దేవేందర్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, స్వాతి, వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టెస్టుకి రెడ్డిపేట్ విద్యార్థి ..

రామారెడ్డి, డిసెంబర్ 9 :మండల కేంద్రంలోని ప్రభుత్వ విద్యావనరుల కేంద్రంలో మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్టును ఎంఈవో ఆనంద్‌రావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షలో రెడ్డిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శ్రీవర్ష ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీగౌడ్, చిన్నస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 9: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా మంజూరైన 108 వాహనాన్ని సోమవారం ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజితావెంకట్రాంరెడ్డి ప్రారంభించారు. వాహనానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలానికి 108 వాహనం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, గంగారెడ్డి, వాస్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్, ఇమామ్, సురేందర్‌గౌడ్, శ్రీరాంగౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

గాంధారి, డిసెంబర్ 9: విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండి చదువుకోవాలని జిల్లా మానసిక వైద్యాధికారి జీ రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే చదువుల్లో రాణిస్తారని సూచించారు. విద్యార్థులకు ఏవైనా మానసిక సమస్యలుంటే 1441 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ వర్కర్, వైద్యుడు రాహుల్‌కుమార్, ప్రిన్సిపాల్ గంగారాం, అధ్యాపకులు శ్రీధర్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, వెంకటస్వామి, లక్ష్మణ్, రమేశ్, సరిత, స్వప్న, రాజ్‌గోపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవాస ప్రాంత పాఠశాల ప్రారంభం

ఇటుక బట్టీ వద్ద ఆవాస ప్రాంత పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈవో

రామారెడ్డి డిసెంబర్ 9: మండలంలోని ఉప్పల్‌వాయి శివారులో ఉన్న ఇటుకబట్టీల వద్ద మండల సీఆర్పీ మహమూద్ ఇటీవల సర్వే నిర్వహించి అక్కడ 10 మంది వరకు బడిఈడు పిల్లలు ఉన్నారని గుర్తించి నివేదికను మండలస్థాయి అధికారులతో జిల్లా అధికారులకు అందించారు. సర్వే నివేదిక ఆధారంగా సోమవారం జిల్లా విద్యాధికారి రాజు ఆ పాఠశాలను ప్రారంభించారు. లేబర్ అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వర్లు పాఠశాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ వేణుశర్మ, ఎంఈవో ఆనంద్‌రావు, ఇటుక బట్టి యజమాని గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 9: మండల కేంద్రం గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట, బంజారా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ మాట్లాడారు. మండలానికి 104 కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజిత, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నియోజక వర్గ నాయకులు రాచంద్రారెడ్డి, వాస్‌రెడ్డి, గంగారెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్, సురేందర్‌గౌడ్, శ్రీరాంగౌడ్, ఇమామ్, గులాం తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ క్రీడలు ప్రారంభం

రామారెడ్డి, డిసెంబర్ 9 : సదాశివనగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ మంగళవారం ప్రారంభిస్తారని ఎంపీడీవో సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి పంపుతామని ఆయన పేర్కొన్నారు.

కళాశాల సందర్శన

కళాశాలను సందర్శించిన అల్ఫోర్ నరేందర్‌రెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 9 : పట్టణంలోని సాయికీర్తి కళాశాలను పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. పట్ట భద్రుల ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌కు చివరిరోజు కావడంతో కళాశాల అధ్యాపకులను కలిసి ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ గురించి వివరించారు. ప్రైవేట్ కళాశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిరుతపులి దాడిలో దూడ మృతి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 9: చిరుతపులి దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చిమ్మ సత్యనారాయణ తన పొలం వద్ద కొట్టంలో రోజు బర్రెలను కట్టేస్తాడు. అదేక్రమంలో ఆదివారం రాత్రి బర్రెలను కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా దూడ మరణించి ఉండడంతో అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలానికి వచ్చిన అధికారులు దూడ మృతి చెందిన పరిస్థితిని గమనించి చిరుతపులి దాడిలో మరణించినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చిరుతపులి అటవీప్రాంతంలోనికి వెళ్లిపోయే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.